## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్సుకో ఏఈ నర్సింలు తెలిపారు. అచ్చన్నపల్లి, గాజులగూడెం, కొడపాక సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

### నియామకపత్రం అందజేత



నియామకపత్రం అందిస్తున్న రఘునందన్‌రావు

నర్సాపూర్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంగళవారం తన నివాసంలో నర్సాపూర్ కౌన్సిలర్ బీజేపీ నాయకుడు సురేష్‌కు బీఎస్ఎన్ఎల్ జిల్లా సలహా కమిటీ మెంబర్‌గా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యలు సలహా కమిటీ సమావేశంలో చర్చించి వారికి మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, పార్టీ నాయకులు శ్రీనివాస్, ఆంజిగౌడ్, కళ్యాణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### మొదలైన ధాన్యం తూకం



సంగాయిపేటలో తూకం వేస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన 20 రోజుల తర్వాత కొనుగోలు కేంద్రాల్లో ఎట్టకేలకు ధాన్యం తూకం మంగళవారం నుంచి మొదలైంది. సన్నరకం ధాన్యం తేమ పరీక్షించే యంత్రాలు ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలకు చేరుకోకపోవడంతో ప్రస్తుతం నిబంధనల ప్రకారం తేమ శాతం వచ్చిన దొడ్డు రకం ధాన్యాన్ని తూకం వేస్తున్నారు.

**తూర్పార బట్టకుండానే తూకం..**

ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లోని పాలకమండలి రైతుల సమన్వయంతో తూకంలో కొంత ఎక్కువ అయినా సరే తూర్పార బట్టేది లేదంటూ బస్తా భర్తీ కింద 42 కిలోల 200 గ్రాముల ధాన్యం తూకం వేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో ధాన్యం తూకం ప్రారంభించారు.

### దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన కోదాస్ పూలమ్మ స్వామి దంపతులను అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి కులం పేరుతో దూషించి, భయాందోళకు గురిచేయగా, అతనిపై పోలీసులు కేసు నమోదు చేసినా.. అరెస్టు చేయలేదన్నారు. ఈ విషయంపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కోదాస్ కుమార్, సత్యనారాయణ, ముత్యాలు ఉన్నారు.

### ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

రేగోడ్(మెదక్): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మెదక్ జెడ్పీ సీఈఓ ఎల్లయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కులగణన బ్లాక్‌ల గురించి సూపరింటెండెంట్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ హెచ్చరించారు.

### పోస్టర్ ఆవిష్కరణ

పాపన్నపేట(మెదక్): సమాజంలో వైజ్ఞానిక దృక్పదాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడుతాయని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి అన్నారు. మండల కేంద్రం పాపన్నపేటలో మంగళవారం చెకుముకి పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెకుముకి సైన్స్ సంబరాలు ఈనెల ఏడున పాఠశాల స్థాయిలో, నవంబర్ 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో నిర్వహిస్తామన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు, పాఠశాల హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నీటికుంట.. డంప్‌తో తంటా!

- చెత్తంతా కుంటలోనే..
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



బతుకమ్మ కుంటలో పారబోసిన చెత్తాచెదారం



డంపు యార్డులో ఉంచిన శిలాఫలకాలు

హవేళిఘణాపూర్(మెదక్): చెత్తాచెదారం డంప్ యార్డులో కాకుండా ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న బతుకమ్మ కుంటలో వేస్తున్నారు. దీంతో తమ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం హవేళిఘణాపూర్ గ్రామంలో సేకరించిన చెత్తను డంపు యార్డులో పోయకుండా, అందులో ఉపాధిహామీకి సంబంధించిన శిలాఫలకాలను ఉంచి, ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న బతుకమ్మ కుంటలో పారపోస్తున్నారు. దీంతో అందులో కుక్కలు, పందులు వచ్చి అక్కడి నుంచి పక్కనే ఉన్న పాఠశాల ఆవరణకు రావడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు దుర్వాసన వస్తుండడం వల్ల అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. కుంటలో చెత్త వేస్తున్నా.. అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చెత్తను డంపు యార్డులోనే వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ రవీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆ విషయం పంచాయతీ సెక్రటరీకే తెలుసునని సమాధానం దాటవేయడం గమనార్హం.

## ప్రభుత్వ ఉద్యోగికి స్థాన చలనం తప్పనిసరి



బదిలీపై వెళ్లిన నీలకంఠంను సన్మానిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ ఉద్యోగికి స్థాన చలనం తప్పనిసరి అని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ అన్నారు. మండల విద్యాధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన నీలకంఠం వీడ్కోలు సమావేశం మంగళవారం పోతంశెట్టిపల్లి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి హాజరయ్యారు. జిల్లాలోని అత్యధిక మండలాలకు విద్యాధికారిగా పని చేసిన నీలకంఠం సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ అధికారి సుదర్శన్ మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మండల విద్యాధికారి సత్యనారాయణ రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిలప్‌చెడ్ ఇన్‌చార్జి ఎస్ఐగా మిస్బావుద్దీన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఇన్‌చార్జి ఎస్ఐగా, ఏఎస్ఐ మిస్బావుద్దీన్ వ్యవహరించనున్నారు. మంగళవారం ఈ సందర్భంగా మిస్బావుద్దీన్ మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ ఎస్ఐగా విధులు నిర్వహించిన యాదగిరి, ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారన్నారు.

## ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ



తూప్రాన్: సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. బుధవారం చేపట్టే సర్వేకు ప్రతి ఒక్కరూ విధిగా సమాచారం అందించి, సర్వేను విజయవంతం చేయాలని కోరారు. సేకరించిన సమాచారాన్ని ఎవరూ బహిరంగంగా వెల్లడించరు కనుక అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. సర్వే సిబ్బందికి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు చేయడానికి అన్ని స్థాయిల అధికారులు, మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎక్కడైనా ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 15 రోజులపాటు జరిగే ఈ సర్వేకు సర్వే సిబ్బంది ఇంటికే వస్తారు కనుక ఎవరు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు.

## రవీందర్‌గౌడ్ సేవలు మరువలేనివి

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రణీద్‌కుమార్

రామాయంపేట(మెదక్): దివంగత ఉపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ విద్యా వ్యవస్థ పతిష్టతకు చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్ అన్నారు. మంగళవారం వివేకానంద విద్యాలయంలో నిర్వహించిన రవీందర్‌గౌడ్ సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గౌడ్ బతికున్న రోజుల్లో నిరుపేద విద్యార్థుల శ్రేయస్సుకోసం పాటు పడ్డారన్నారు. ఎంఈవో శ్రీనివాస్, పీఆర్టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీఆర్‌టీఎఫ్ మండలాధ్యక్షుడు నాగేందర్, ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, టీపీటీఎఫ్, తపస్ మండలాధ్యక్షులు,నిజాంపేట మండల అధ్యక్షుడు కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



అచ్చంపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్ఞానజ్యోతి

వెల్దుర్తి(తూప్రాన్): దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, వాటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్ఞానజ్యోతి అన్నారు. మంగళవారం మాసాయిపేట మండలంలోని అచ్చంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సిద్ధయ్య, డైరెక్టర్ ఉదండపురం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం**

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్ గ్రామంలో మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ సర్వని సరోజ, మాజీ సర్పంచ్ సంగయ్య, కార్యదర్శి పోచయ్య, నాయకులు పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగంతోనే దిగుబడి అంచనా



అజ్జమర్రిలో పంటకోత ప్రయోగంలో వచ్చిన ధాన్యంతో వెంకటేశ్ తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంటకోత ప్రయోగంతోనే పంట దిగుబడి అంచనా సరిగ్గా వెయ్యొచ్చని ఏఎస్ఓ వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన ఏఈఓ భూపాల్‌తో కలిసి మండలం అజ్జమర్రి గ్రామంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు స్థలంలో పంటను కోసి, ఆ వచ్చిన ధాన్యం తూకం వేసి, పంట దిగుబడి అంచనా వేస్తామన్నారు. గ్రామ రైతు బేగరి బాల్‌రాజ్ అనే రైతు పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించి, ఎకరాకు 30 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అశోక్, సత్తయ్య, మల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.

## కళాశాల సమయానికి బస్సులు నడపాలి

తూప్రాన్–గజ్వేల్ రహదారిపై విద్యార్థుల రాస్తారోకో



తూప్రాన్–గజ్వేల్ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

తూప్రాన్: కళాశాల సమయానికి బస్సులు నడిపించాలని డిమండ్ చేస్తూ తూప్రాన్–గజ్వేల్ రహదారిపై మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కమిటీ సభ్యులు జగన్ మట్లాడుతూ.. తూప్రాన్ మండలం, ఘనాపూర్ గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులు పలు కళాశాలలో చదువుతున్నారని, కళాశాల సమయానికి బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కళాశాల సమయం 9:00 గంటలకు కాగా బస్సులు మాత్రం 10:30కు వస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బస్సులు సమయానికి నడిపించాలని డిమాండ్ చేశారు.

## టీకాలతో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి

నర్సాపూర్ ఏడీ జనార్దన్‌రావు



శీలాంపల్లిలో గేదెకు గాలికుంటు టీకా వేస్తున్న ఏడీ జనార్దన్‌రావు, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, పశువు ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందని నర్సాపూర్ ఏడీ జనార్దన్‌రావు అన్నారు. మంగళవారం ఆయన పశువైద్య సిబ్బందితో కలిసి మండలంలోని శీలాంపల్లి గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ వినోద్, వెటర్నరీ అసిస్టెంట్ ఇబ్రహీం, సిబ్బంది శంకర్, అరవింద్ పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సింధూరేణుక

హవేళిఘణాపూర్(మెదక్): పట్టభద్రులు సరైన పత్రాలను జత చేసి ఓటు హక్కును నమోదు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సింధూరేణుక మంగళవారం అన్నారు. మండలంలో ఎవరైనా పట్టాభద్రులు దరఖాస్తు కోసం బుధవారం చివరి గడువు కావడంతో అర్హత కలిగిన వారు గ్రాడ్యుయేట్ మెమో, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రెండు ఫొటోలను జత చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అందుబాటులో ఉన్న వారు తమ కార్యాలయంలో బుధవారం సాయంత్రం లోపు సమర్పించాలని, పట్టాభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

నర్సాపూర్: మండల రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని ఆర్డీఓ మహిపాల్ సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో తన కార్యాలయంలో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈనెల 6 నుంచి చేపట్టే ఇంటింటి సర్వేను పర్యవేక్షించాలని, నిబంధనల మేరకు సర్వే జరిగేలా చూడాలని సూచించారు. ధరణి, మీసేవ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ తదితర దరఖాస్తులను విచారణ చేసి పరిష్కరించి లబ్ధిదారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు జాబితా తదితర పనులను సమర్థవంతంగా చేపట్టాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీఈ సహదేవ్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం



కొడిపల్లిలో వరిధాన్యం పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ

హవేళిఘణాపూర్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మల్లేశం ఆరోపించారు. మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతులు నెల రోజుల ముందుగానే వరికోతలు కోసి, ధాన్యం రాశులు పోసి ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే రైతులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు రాములు, సిద్ధిరాములు, శేఖర్, సత్యం, నర్సింహరెడ్డి, బాలమణి తదితరులు ఉన్నారు.

**ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటు**

కొడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ విమర్శించారు. మండల కేంద్రం కొడిపల్లి పెద్దచెరువుకట్టపై వరిధాన్యం కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయన్నారు. ఓవైపు అకాలవర్షాలు.. మరోవైపు టార్పాలిన్ల అద్దె పెరిగి పోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నాగరాజు, మల్లేశం,శేఖర్ రైతులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల నిమిత్తం మండలంలో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలని సూచించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్, సహకార సంఘం సీఈవో నర్సింలు పాల్గొన్నారు.

**తేమ శాతంపై అవగాహన**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ధాన్యం తేమశాతంపై అవగాహన కల్పించారు. అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినిత్, అఖిల్‌హుస్సేన్, మమత, పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ రైతులు ఆందోళన చెందొద్దు**

కొడిపల్లి(నర్సాపూర్): రైతులు ఆందోళన చెందొద్దని ప్రభుత్వం ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మాసాగర్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుపై బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైస్‌మిల్లర్లకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిల్లింగ్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు చెల్లించలేదని చెప్పారు. ధాన్యం దళారులపాలు కాకుండా పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో శ్రమిస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో రైతులను ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రఘు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, రాయిలాపూర్ మాజీ సర్పంచ్ శేఖులు, నాయకులు పర్వతాలు, శేఖర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**◆ పాఠశాల రికార్డుల పరిశీలన**

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బద్దారం ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ పరిశీలకుడు నితిన్ సందర్శించారు. మంగళవారం పాఠశాలను ఎంఈఓ వెంకటేశంతో కలిసి బోధన, మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యార్థులకు సులభరీతిలో బోధన చేపట్టాలని హెచ్ఎం రాములకు వారు సూచించారు. విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం విఠల్ తదితరులున్నారు.

**◆ ఎరువుల దుకాణాల తనిఖీ**

నర్సాపూర్: పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయాధికారి దీపిక మంగళవారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులు తనిఖీ చేసి, లైసెన్సును సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఎరువులు, రసాయన మందులు విక్రయించాలని, బిల్లు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని వారు దుకాణ డీలర్లకు సూచించారు. కల్తీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు.

**◆ 25 క్వింటాళ్ల స్టీల్ చోరీ**

శివ్వంపేట(నర్సాపూర్): నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద నిల్వ ఉంచిన స్టీల్‌ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామ పరిధిలో గ్రామస్తులు నూతనంగా శివాలయం నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనుల కోసం తీసుకొచ్చి నిల్వ ఉంచిన 25 క్వింటాళ్ల 8, 6 ఎంఎం స్టీల్‌ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మంగళవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, చోరీ ప్రదేశాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేశారు.

**◆ ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి**

చేగుంట(తూప్రాన్): ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని రైతుకూలీ పోరాటసమితి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చేగుంటలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోత్సవాలకు చూపిన శ్రద్ధ ధాన్యం సేకరణపై చూపడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

**◆ శిక్షణతో భవిష్యత్**

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఒకేషనల్ విద్యార్థుల ఆన్ జాబ్ శిక్షణ వారికి మంచి భవిష్యత్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. ఒకేషనల్ కోర్సు చదువుతున్న ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన విద్యార్థులు మోటార్ వైండింగ్‌లో పొందుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆఫీస్ అసిస్టెంట్ విద్యార్థులు పలు బ్యాంకుల్లో శిక్షణ పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ అధ్యాపకులు బాలప్రకాశ్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.

**◆ టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా బాలరాజు**

పాపన్నపేట(మెదక్): టీపీటీఎఫ్ పాపన్నపేట మండలాధ్యక్షుడిగా బాలరాజు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రమేశ్, ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, కాషస్, లక్ష్మి, షహీన్‌బేగం, కార్యదర్శులుగా జయవర్ధన్, నవీన్‌కుమార్, కవిత, ముజీబ్, విశ్వనాధ్ ఎన్నికయ్యారు.

**చార్జీలు తగ్గించి అద్దెకు బస్సులు**

నర్సాపూర్: ఆర్టీసీ చార్జీలు తగ్గించి, బస్సులు అద్దెకు ఇస్తుందని ఆర్టీసీ ఇన్‌చార్జి డిపో మేనేజర్ సురేఖ చెప్పారు. కార్తికమాసం సందర్భంగా పుణ్యక్షేత్రాల దర్శనాలకు, పెళ్లిళ్లకు అద్దె ప్రాతిపదికన చార్జీలు తగ్గించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**◆ టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక**

టేక్మాల్(మెదక్): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) టేక్మాల్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టేక్మాల్ ఉన్నత పాఠశాలలో సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారిగా హీరాలాల్ రాష్ట్ర కౌన్సిలర్‌గా వ్యవహరించి, టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శిగా ఎం.మురళి, ఉపాధ్యక్షులుగా పి.నాగభూషణం, బి రాజయ్య, ఎండీ. సాజిద్ పాషా, కార్యదర్శులుగా ఎండీ హబీబ్, మల్లేశం, ఎండీ మౌలానా, జిల్లా కౌన్సిలర్లుగా పి. శ్రీనివాస్, ఉమామహేశ్వర్, కిషన్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**◆ శ్మశాన వాటిక ఏర్పాటు చేయండి**

మెదక్ కలెక్టరేట్: శ్మశాన వాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పట్టణంలోని 13వ వార్డు ఎర్రొల్ల బస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కాలనికి చెందిన మహిళలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట నిరసన చేసి, అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ శ్మశాన వాటిక లేకపోవడంతో సొంత పొలాల్లో ఖననం చేసుకుంటున్నామన్నారు. సొంత స్థలాలు లేని ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**◆ ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరిస్తేనే, మానసిక ప్రశాంతత లభిస్తుందని పైజాబాద్ గ్రామ హనుమాన్ భజన మండలి సభ్యులు అన్నారు. మండలంలోని సోమక్కపేట్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో కార్తీక సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు 24 గంటల పాటు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయంలో భగవంతుడి నామస్మరణ గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు అశ్విన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, గోపాల్ రావు, రవీందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**◆ చెక్కు అందజేత**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన పోతారపల్లి లచ్చయ్య కొద్దికాలం క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మంగళవారం మృతుడి భార్య పోతారపల్లి లలితకు మెదక్ విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈఈ చాంద్‌పాషా షరీఫ్ రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 50 వేలు నగదు ఇచ్చి, మిగిలిన రూ. 4.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో చిట్కుల్ మాజీ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, విద్యుత్‌శాఖ జూనియర్ అకౌంటెంట్ వేణు పాల్గొన్నారు.